సాక్షి తిరుపతి

శుక్రవారం ı 26 ı సెప్టెంబర్ ı 2025



హంసవాహనంపై శ్రీనివాసుడు



చిన్న శేష వాహనంపై మలయప్ప స్వామి

విపంచి ధరించి..
విహరించి..

పాలకడలిపై తేలియాడే శేషుడు తిరువీధులకు తరలివచ్చాడు. ఆపద మొక్కుల వాడికి వాహనమయ్యాడు. శ్రీహరి చిద్విలాసంగా విహరించాడు. రాయంచ సింహాసం కాగా శ్రితపరిపాలకుడు వీణాపాణి ధరించి, విహరించాడు. వివేచన బోధించాడు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తన్మయులయ్యారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు గురువారం చిన్న శేష, హంస వాహనాలపై మలయప్పస్వామి విహరించారు. ఈ వాహనసేవల్లో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కళా ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు. – తిరుమల



వాహన సేవలో పౌరాణిక కళాప్రదర్శన



కళాకారులతో టీటీడీ ఈఓ సింఘాల్



నృత్యం చేస్తున్న కళాకారులు

న్యూస్‌రీల్

జాబ్ మేళా రేపు

తిరుపతి అర్బన్: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురంలోని డాక్టర్ ఆర్సీ రెడ్డి డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మేళా ప్రారంభం అవుతుందన్నారు. తిరుపతి నగరంతోపాటు ఈఎంసీ క్లస్టర్, శ్రీసిటీ, చెన్నైలోని పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొంటారని చెప్పారు. ఇంటర్వ్యూలకు వచ్చే యువతీయువకులు శుక్రవారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నైపుణ్యం.ఏపీ.జీవోవీ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు. అదనపు సమాచారం కోసం 7013509543, 9988853335 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

బీఎన్‌కండ్రిగ ఏఎంసీ చైర్మన్ రిజర్వేషన్ మార్పుపై స్టే

వరదయ్యపాళెం: బీఎన్‌కండ్రిగ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి సంబంధించి రిజర్వేషన్ మార్పు చేసిన ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ హైకోర్టు స్టే విధించింది. ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించిన గిరిజన రైతు వై.సురేంద్ర ఈ వివరాలను వెల్లడించారు. బీఎన్‌కండ్రిగ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని గిరిజన విభాగానికి రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ రిజర్వేషన్‌ను కూటమి పెద్దల సహకారంతో మార్పు చేసి, జనరల్ మహిళకు కేటాయించారు. ఆ మేరకు బీఎన్‌కండ్రిగ మండలానికి చెందిన టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు సతీమణి మావిళ్లపల్లి జ్యోతిని చైర్మన్‌గా నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కేవీబీపురం మండలం కోవనూరు గ్రామానికి చెందిన గిరిజన రైతు వై.సురేంద్ర హైకోర్టును ఆశ్రయించి గిరిజన రిజర్వేషన్ మార్పుపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో దీనిపై స్పందించిన హైకోర్టు రిజర్వేషన్ మార్పు విధానాన్ని తప్పుపడుతూ స్టే విధించినట్లు ఆయన తెలిపారు.

సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోండి



అప్పడాల ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్న అధికారులు

రేణిగుంట: పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా రూ.10 లక్షల సబ్సిడీతో ఏర్పాటు చేసిన అప్పడాల తయారీ ఫ్యాక్టరీని గురువారం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిన్నరెడ్డెయ్య ప్రారంభించారు. అలాగే రూ.30 లక్షల రుణం అందజేశారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ యువతీ,యువకులు ప్రభుత్వ సబ్సిడీ రుణాలను వినియోగించుకోవాలన్నారు. కొత్త వ్యాపారాలు ప్రారంభించి, మరికొందరికి ఉపాధి కల్పించాలి అని సూచించారు.



గ్రావెల్ గుంతలో నుంచి మృతదేహాన్ని వెలికి తీస్తున్న పోలీసులు

ఎక్కడి కెళ్లారయ్యా.. గుండె చెరువు చేసి..

ఎక్కడి కెళ్లారయ్యా.. గుండె చెరువు చేసి.. అంటూ మృతి చెందిన చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. స్నేహితులైన చిన్నారులిద్దరు సరదాగా డ్రాగన్‌ఫ్రూట్, కలేకాయల కోసం వెళ్లి, అక్కడ ఉన్న చెరువు వద్ద ఆడుకుంటూ, గ్రావెల్ కోసం మట్టి మాఫియా తీసిన గుంతల్లో గల్లంతయ్యారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి, ఒక రోజు అనంతరం చెరువులో మునిగి మృతి చెందినట్లు గుర్తించి, మృతదేహాలను వెలికితీశారు. దీంతో ఉయ్యాలపల్లె కన్నీటి సంద్రమైంది.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

అదృశ్యమైన చిన్నారులు.. అనంతలోకాలకు..

- మరణంలోనూ వీడని స్నేహబంధం
- ఉయ్యాలపల్లిలో విషాదఛాయలు
- చిన్నారులను పొట్టన పెట్టుకున్న గ్రావెల్ మాఫియా

కలువాయి(సైదాపురం): మట్టి మాఫియా దాహానికి ఇద్దరు చిన్నారులు బలయ్యారు. సరదాగా ఆడుతూ..పాడుతూ.. కలేకాయల కోసం వెళ్లిన ఇద్దరు చిన్నారులు మృత్యుఒడిలోకి చేరుకున్నారు. సమీపంలోనే గుంతల్లో ఇరుకున్న విషయం తెలుసుకున్న పోలీసుల బృందం బురద గుంతల్లో గురువారం మధ్యాహ్నం వరకు శ్రమించి మృతదేహాలను వెలికి తీశారు. ఆ రెండు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. వివరాలిలావున్నాయి. ఉయ్యాలపల్లి గ్రామానికి చెందిన నూతేటి ప్రసాద్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నూతేటి విష్ణుకుమార్(11) స్థానిక నవభారత్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. అలాగే అదే గ్రామానికి చెందిన మనబోటి నరసింహులు, సునీత దంపతుల కుమారుడు మనోబోటి నవశ్రావణ్ స్థానిక ఎంపీయూపీ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వీరిద్దరూ చిన్నప్పటి నుంచి స్నేహితులు కావడంతో ఎక్కడికి వెళ్లినా ఇద్దరే వెళ్లి సరదాగా ఆడుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలో డ్రాగన్‌ఫ్రూట్ తోట ఉండడంతో ఇద్దరు స్నేహితులు కలసి డ్రాగన్ ఫ్రూట్స్, కలేకాయల కోసం బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లారు. చీకటిపడినా ఇంటికి రాకపోవడంతో ఇరు కుటుంబాల సభ్యులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో నెల్లూరు జిల్లా ఎస్పీ వి.అజిత ఆదేశాల మేరకు సంగం సీఐ వేమారెడ్డి, రాపూరు, కలువాయి, మర్రిపాడు, చేజర్ల ఎస్ఐలు ఉయ్యాలపల్లి గ్రామానికి బుధవారం రాత్రి చేరుకున్నారు. అనంతరం పిల్లల ఆచూకీ కోసం గ్రామస్తులతో కలసి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రంగంలోకి డాగ్‌స్క్వాడ్, డ్రోన్ కెమెరాలను ఘటన స్థలానికి తీసుకువచ్చి మరో కోణంలో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన మొదలైంది. ఆ సమయంలో ఉయ్యాలపల్లి సమీపంలోని చెరువు వద్ద మట్టి మాఫియా తవ్విన గుంతల్లో మృతదేహాలు ఉన్నాయంటూ స్థానికులు పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన సంగం సీఐ వేమారెడ్డి, రాపూరు,సైదాపురం, మర్రిపాడు, చేజర్ల ఎస్ఐలు వెంకటరాజేష్, క్రాంతికుమార్, శ్రీనివాసు, తిరుమలరావు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతమంతా బురదమయంగా ఉండడంతో యంత్రాల సహాయంతో నీటిని తోడారు. మృతదేహాలను బయటకు తీశారు. అక్కడే ఉన్న వారంతా విష్ణు, శ్రావణ్ మృతదేహాలను చూసి కన్నీరు మున్నీరుగా రోదించారు. మట్టి గుంతలు చిన్నారుల ప్రాణాలుతీశాయంటూ మృతుల కుటుంబాల సభ్యుల శాపనార్థాలు పెట్టారు. చిన్న వయసులోనే నిండి నూరేళ్లు నిండాయా? అంటూ రోదించారు.

మరణంలో కూడా వీడని స్నేహబంధం

విష్ణుకుమార్, నవశ్రావణ్ చదివేది వేర్వేరు పాఠశాలలు, వేర్వేరు తగతులైనా ఇద్దరూ చిన్నతనం నుంచే ఆడుతూ,పాడుతూ మంచి స్నేహితులుగా ఉండేవారు. ఎక్కడికి వెళ్లినా ఇద్దరూ కలసి మెలసి వెళుతూ గ్రామంలో సందడిగా ఉండేవారు. అంతటి స్నేహితులైన వారి మరణం కూడా వారిని విడదీయలేకుండా పోయింది. ఇద్దరూ చనిపోయారా? నాయనా అంటూ.. గ్రామస్తులు, బంధువులు బోరున విలపించారు.



మృతిచెందిన చిన్నారులు (ఫైల్)



మృతదేహాల కోసం పడిగాపులు పడుతున్న గ్రామస్తులు

కన్నీటి సంద్రమైన ఉయ్యాలపల్లి..

చిన్నారుల మృతితో ఉయ్యాలపల్లె కన్నీటి సంద్రమైంది. ఇంటి నుంచి బుధవారం సాయంత్రం వెళ్లిన ఇద్దరు చిన్నారుల ఆచూకీ కోసం రాత్రి అంతా కంటి మీద కునుకులేకుండా గ్రామస్తులతోపాటు పోలీసులు తీవ్ర అన్వేషణ చేశారు. గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఉన్న గుంతల్లో చిన్నారులు విగతజీవులుగా కనిపించడం.. ఆ మృతదేహాలను వెలికి తీసేందుకు పోలీసులు కూడా ఇబ్బందులు పడ్డారు. మృతదేహాలను చూసి ఇరువురు చిన్నారులు కుటుంబాలతోపాటు గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. గుండెలవిసేలా తల్లిదండ్రులు రోదిస్తుండడంతో వారిని ఓదర్చడం ఎవరి తరం కాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ నేపథ్యం..

ఉయ్యాలపల్లికి చెందిన నూటేటి ప్రసాద్ లక్ష్మీదేవిలకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారెలు ఉన్నారు. అతను బతుకు దెరువుకోసం కువైట్‌కు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మృతి చెందిన విష్ణుకుమార్ చివరి వాడు కావడంతో అల్లారు ముద్దుగా పెంచారు. తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించేందుకు ప్రసాద్ కువైట్‌కు వెళ్లి రూపాయి రూపాయి కూడపెట్టి పిల్లలను చదివిస్తున్నారు. ఈ క్రమంలో విష్ణుకుమార్‌ను కూడా ప్రైవేటు పాఠశాలలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ప్రసాద్ కూడా ఇటీవల కువైట్ దేశం నుంచి స్వగ్రామానికి వచ్చారు. మళ్లీ కువైట్‌కు వెళ్లే సమయంలో ఈ విషాదం నెలకొనడంతో తమ ఆశలు ఆడియాశలు ఆయ్యాయంటూ రోధించడం అందరిని కలచివేసింది. అలాగే మనుబోటి నరసింహులు టిప్పర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ భార్య సునీత ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నారు. ఇద్దరు చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చదువిస్తున్నారు. రెండో కుమారుడు నవ శ్రావణ్ నీటి గుంతలో పడి మృతి చెడడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.

తప్పిపోయిన భక్తులు అప్పగింత



తప్పిపోయిన భక్తులను వారి బంధువులకు అప్పగిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల: తిరుమలలో తప్పిపోయిన ముగ్గురు భక్తులను పోలీసులు డిజిటల్ జియోటాక్ సహకారంతో సురక్షితంగా పట్టుకుని, బంధువులకు అప్పగించారు. వివరాలు.. తిరుమల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నంద్యాలకు చెందిన పీ.మోహిత్‌రెడ్డి(14), ప్రకాశం జిల్లాకు చెందిన పీ.నరసింహరావు(52), తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన మారుతి(70) తప్పిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు డిజిటల్ జియోటాక్ టెక్నాలజీ సహాయంతో వారిని సురక్షితంగా పట్టుకున్నారు. ఆపై వారి తల్లిదండ్రులు వెంకటసుబ్బమ్మ, ఎం.నారాయణ, మణికి అప్పగించారు.

భక్తుల భద్రత మా బాధ్యత

భక్తుల భద్రత మా బాధ్యతని, వారి భద్రత కోసం చర్యలు తీసుకుంటామని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. భక్తులు ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని, డిజిటల్ టెక్నాలజీ వినియోగంతో భక్తుల భద్రత మరింత బలోపేతం అవుతుందన్నారు. భవిష్యత్‌లో కూడా భక్తుల కోసం మరిన్ని సరికొత్త సదుపాయాలు అందించడానికి జిల్లా పోలీసులు కృషి చేస్తారని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 58,628 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,551 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.01 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 10 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారు 3 గంటల్లో తిరుమలేశుని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

‘స్టూడెంట్ నెం–1’కు గోల్డ్ మెడల్!

- ఓపెన్ డిగ్రీలో మంచి మార్కులతో జీవిత ఖైదీ యుగంధర్ ప్రతిభ
- మూడు పీజీలు చేసిన ఖైదీ



జీవితఖైదు అనుభవిస్తున్న గునుకుల యుగంధర్ (ఫైల్)



మీడియాతో మాట్లాడుతున్న యుగంధర్ తల్లి చెంగమ్మ, చెల్లెలు మేఘన

కడప అర్బన్: జీవితఖైదు అనుభవిస్తున్న గునుకుల యుగంధర్ అనే ‘స్టూడెంట్ నెం –1’ డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చడంతో గోల్డ్‌మెడల్ వరించింది. ఈ సంఘటనపై కడప కేంద్ర కారాగారం అధికారులు, యుగంధర్‌తో ములాఖత్ అవడానికి వచ్చిన అతని తల్లి చెంగమ్మ, చెల్లెలు మేఘన తెలియజేశారు. కడప కేంద్ర కారాగారంలో జీవితఖైదు అనుభవిస్తున్న గునుకుల యుగంధర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ కనపరచడంతోపాటు మంచి ర్యాంకు సాధించడంతో అతనికి గోల్డ్ మెడల్‌కు ఎంపిక చేశారు. ప్రస్తుతం అండర్ గ్రాడ్యుయేషన్ బీఏ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్ వారిచే గోల్డ్ మెడల్, బుక్ ప్రైజ్ పొందారు. ఈనెల 30వ తేదీన హైదరాబాద్‌లో జరిగే 26వ స్నాతకోత్సవంలో పాల్గొని, మెడల్ పొందేందుకు అతనికి యూనివర్సిటీ నుంచి ఆహ్వానం లభించింది. ఇతనికి మొత్తం 8.02 జీపీఏ వచ్చింది. ప్రస్తుత తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం, జంగాలపల్లి నివాసి అయిన గునుకుల యుగంధర్ 2011 జూలై 18న హత్య కేసులో జీవిత ఖైదు విధించడంతో కేంద్ర కారాగారానికి వచ్చాడు. అప్పటి నుంచి ఓల్డ్ పాటర్న్‌లో రెండు బీఏలు, న్యూ పాటర్న్‌లో చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్(సీబీఎస్‌సీ)లో రెండు బీఏలు, మూడు ఎంఏలు ఇంకా కంప్యూటర్ ట్రైనింగ్, కార్పెంటరీ ట్రైనింగ్, నాక్ స్కిల్ సర్టిఫికెట్లు పొందాడు. మూడేళ్లు పారా లీగల్ వలంటీర్‌గా పనిచేశారని కడప కారాగార అధికారులు తెలిపారు.

నా బిడ్డకు క్షమాభిక్ష పెట్టండి

- జీవిత ఖైదీ యుగంధర్ తల్లి చెంగమ్మ ఆవేదన

హత్య కేసులో దాదాపు 20 సంవత్సరాల నుంచి జీవిత ఖైదును తన కుమారుడు యుగంధర్ అనుభవిస్తున్నాడని, అతని చెంగమ్మ, సోదరి మేఘన ఆవేదన వ్యక్తం చేశారు. చదువుల్లో గోల్డ్ మెడల్ సాధించాడని, కారాగారంలో సత్ప్రవర్తన కలిగి ఉన్నాడని అధికారులు, ప్రభుత్వం తమ ఆవేదన గుర్తించి, తన బిడ్డను క్షమాభిక్ష పెట్టి, విడుదల చేయాలని కోరారు. కడప కారాగారానికి ములాఖత్‌కు వచ్చిన వారు విలేకరులతో మాట్లాడారు. తమకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడని ఖైదీ తల్లి చెంగమ్మ తెలిపారు. కుమారుడైన యుగంధర్ తెలిసో తెలియక హత్య చేశాడని, ఆ నేరానికి 20 ఏళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తున్నారని, ఇప్పటికైనా క్షమాభిక్ష ప్రసాదించి, తన కుమారుడిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

ఉపరాష్ట్రపతికి సాదర వీడ్కోలు


ఉపరాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి దర్శనం అనంతరం గురువారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూ మాజీ సెక్రటరీ ఎం హరి జవహర్, డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు సాదరంగా వీడ్కోలు పలికారు.

విద్యుదాఘాతంతో కౌలురైతు దుర్మరణం


శివ(ఫైల్)

కేవీబీపురం: విద్యుత్ లైటు మరమ్మతు చేస్తూ, ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కౌలు రైతు మృత్యువాత పడిన ఘటన కేవీబీపురం మండలంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు కథనం మేరకు.. మండంలోని అంజూరు పాళెం గ్రామానికి చెందిన శివ(33) స్థానికంగా ఉన్న సుమారు ఎకరా సొంత భూమితో పాటు, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తమ పొలంలో ఉన్న మోటారు వద్ద ఉన్న లైటు కాలిపోయింది. దాన్ని ఇంటికి తెచ్చి, మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని శ్రీకాళహస్తిలోని ఒక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, రితిక్ (4), సుదర్శిని (2) పిల్లలు ఉన్నారు.

కార్పొరేటర్ సంధ్య ఇంట విషాదం

- రోడ్డు ప్రమాదంలో సంధ్య భర్త, కుమార్తె మృతి



డాక్టర్ వెంకట కిషోర్, అశ్విత మృతదేహాలు

తిరుపతి తుడా: స్థానిక 49వ డివిజన్ కార్పొరేటర్ అన్నా సంధ్య ఇంట విషాదం నెలకొంది. గుంటూరులో బంధువుల ఇంట ఓ ప్రత్యేక కార్యక్రమానికి హాజరయ్యేందుకు బుధవారం రాత్రి భర్త, పిల్లలతో బయలు దేరిన కార్పొరేట్ సంధ్య వాహనం ప్రమాదానికి గురైంది. గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో చిలకలూరిపేట సమీపంలో ఈ ప్రమాదం జరగడంతో అందులో ప్రయాణిస్తున్న కార్పొరేటర్ అన్నా సంధ్య భర్త, స్విమ్స్ ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట కిషోర్, ఆమె కుమార్తె అశ్విత మరణించారు. దీంతో తిరుపతి కొర్లగుంటలో పెనువిషాదం నెలకొంది. అందులో ప్రయాణిస్తున్న కార్పొరేటర్ సంధ్య గాయాలతో బయటపడి చికిత్స పొందుతోంది. ఈ విషాదంపై స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు, కార్పొరేటర్లు విచారం వ్యక్తం చేశారు.

పడగల నీడన పరంధాముడు


హంస వాహనంపై సరస్వతీ అలంకరణలో శ్రీహరి


చిన్నశేషునిపై విహరిస్తున్న కల్యాణ వేంకటేశ్వరుడు


ఉత్సవర్లుకు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న స్నపన తిరుమంజనం

- నయనానందకరంగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- చిన్న శేష వాహనం, హంస వాహనంలపై శ్రీహరి చిద్విలాసం
- భక్తులకు కనువిందు చేసిన స్నపన తిరుమంజనం
- ఊంజల సేవతో దేవేరులతో కలసి ఊయలూగిన శ్రీవారు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట కళ్యాణ వేంకశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన గురువారం ఉదయం కల్యాణ వేంకటేశ్వరస్వామి చిన్న శేష వాహనంపై శ్రీకృష్ణుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నశేషునిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. విశేషాలంకార భూషితుడైన స్వామి వారు చిన్నశేషునిపై కొలువుదీరి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. చిన్న శేష వాహన సేవలో తరించిన భక్తుల గోవింద నామ స్మరణలతో తుమ్మలగుంట గ్రామం పులకించింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, ఆమె కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డితోపాటు చెవిరెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, మంజుల దంపతులు వాహన సేవల్లో పాల్గొన్నారు.

హంస వాహనంపై మలయప్ప

కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి హంస వాహనంపై స్వామివారు సరస్వతీ దేవిగా భక్తులను కటాక్షించారు. చెవిరెడ్డి కుమారులైన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డిలు వాహనం మోసి తమ భక్తిని చాటుకున్నారు. గోవింద మాల ధరించిన ఆ ఇద్దరితో పాటు యువకులు గోవింద నామస్మరణలు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు ఆకట్టుకున్నారు. అంతకు ముందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి ఊంజల్ మండపంలో నిర్వహించిన ఊంజల్ సేవను భక్తులు వీక్షించి భక్తి సాగరంలో మైమరిచారు.

ఆకట్టుకున్న కళా బృందాలు

బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కళా బృందాలు, భజన బృందాలు భక్తులను ఆకట్టుకున్నా యి. చిన్నశేష, హంస వాహన సేవలో పాల్గొన్న భక్తు లు స్వామిని దర్శించడంతో పాటు వాహనం ముందు వెళుతున్న కళాకారులు, భజన బృందాలను కళ్లా రా వీక్షించి భక్తి సాగరంలో మునిగారు. కోలాటాలు, చెక్కభజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.


చిన్నశేష వాహన సేవలో పాల్గొన్న చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, మంజుల దంపతులు


గాల్లోకి ఎగురుతూ భక్తులను అలరిస్తున్న కేరళ వాయిద్యకారులు

జ్ఞానానికి గమ్యస్థానం ఐకేఎస్ కేంద్రం

- ఎన్ఎస్‌యూలో ఐకేఎస్ కేంద్ర ప్రారంభం


ఐకేఎస్ సెంటర్ ప్రారంభోత్సవంలో అతిథులు

తిరుపతి సిటీ: ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే కేంద్రంగా ఇండియన్ నాలెడ్జ్ సెంటర్ (ఐకేఎస్) ప్రారంభించడం శుభపరిణామమని ఎన్ఎస్‌యూ చాన్సలర్ ప్రొఫెసర్ నీడా మంగళం గోపాలస్వామి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో అతిథులు, వర్సిటీ అధికారులతో కలసి ఆయన ఐకేఎస్ కేంద్రాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి విజ్ఞాన, వైజ్ఞానిక అంశాలను అందించడమే ఐకేఎస్ లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. విదేశీయులకు సైతం వర్సిటీలోని ఐకేఎస్ కేంద్రం జ్ఞానానికి గమ్యస్థానం కావాలని ఆకాంక్షించారు. అనంతరం బ్రహ్మశ్రీ సహస్రావధాని, పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ మాట్లాడుతూ భారతీయ జ్ఞానపరంపరలో విశిష్ట పర్వం అవధానమని, అవధాన కళ విద్యార్థుల్లో స్మృతి శక్తిని, ప్రతిభాశక్తిని వర్ధింపజేస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ భారతీయ జ్ఞాన పరంపరంలోని అనేక వైజ్ఞానిక, మనోవైజ్ఞానిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, న్యూఢిల్లీ జాతీయ కోఆర్డినేటర్ గంటి సూర్యనారాయణమూర్తి, డీన్లు రజనీకాంత్, దక్షిణమూర్తి శర్మ, ప్రొఫెసర్ శివ రామ భట్, పీఆర్ఓ ప్రొఫెసర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో తిరుచానూరులో దారుణం

- ఇంట్లోకి చొరబడి యువకుడిపై దాడి
- హత్యాయత్నానికి దారితీసిన ప్రేమాయణం
- ఇద్దరు విద్యార్థులు ఒకే యువతిని ప్రేమించడంతో గొడవ
- అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్న యువకుడు


చికిత్స పొందుతున్న దినేష్

చంద్రగిరి: ఓ బృందం గంజాయి మత్తులో ఓ విద్యార్థిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన బుధవారం అర్ధరాత్రి తిరుచానూరులో కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. తిరుచానూరుకు చెందిన తోటకూర కుహల్, దినేష్ మిత్రులు. వీరు డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ ఒకే యువతిని ప్రేమించారు. ఈ విషయం ఇద్దరికీ తెలియడంతో కొద్ది రోజులుగా గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం కుహల్, దినేష్ మధ్య వాట్సాప్‌లో వివాదం చేసుకున్నారు. ఈ వివాదం మరింత ముదిరింది. తీవ్ర ఆగ్రహానికి లోనైన కుహల్ 20 మందితో కలిసి గంజాయి సేవించి, వారిని వెంటబెట్టుకుని, తిరుచానూరు నేతాజీ రోడ్డులోని దినేష్ ఇంటికి బుధవారం అర్ధరాత్రి వెళ్లాడు. ఆపై ఇంట్లో ఉన్న దినేష్‌పై దాడికి చేశారు. తన బిడ్డపై దాడి జరగడంతో దినేష్ తల్లి అడ్డుగా రావడంతో ఆమెను సైతం చితకబాదారు. అనంతరం దినేష్‌ను బయటకు లాగి కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన దినేష్ అక్కడే కుప్పకూలి పడిపోయాడు. కడుపులోని పేగులు బయటకు రావడంతో ఆర్తనాదాలు చేశాడు. గంజాయి మత్తులో దినేష్‌పై దాడికి పాల్పడిన అల్లరి మూకలు, కాసేపు అక్కడే నిలబడి వీర విహారం చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. కాసేపటికి స్థానికులు బయటకు వచ్చి రక్తపు మడుగులో పడి ఉన్న దినేష్‌ను హుటాహుటిన రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం దినేష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు?

గంజాయి మత్తులో దినేష్‌పై హత్యాయత్నానికి పాల్పడిన యువకుల్లో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దాడికి పాల్పడిన మిగిలిన వారు పరారీలో ఉండడంతో వారిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు. కేవలం యువతి ప్రేమ వ్యవహారమే గొడవకు ప్రధాన కారణంగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మిగిలిన నిందితుల కోసం గాలింపులను ముమ్మరం చేశారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

పెళ్లకూరు: మండలంలోని చెంబడిపాళెంలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై పన్నీరు సెల్వం(22) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నగరి ప్రాంతానికి చెందిన పన్నీరు సెల్వం గ్రామంలో ఉన్న గ్రామదేవత ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు సంబంధించి విద్యుత్ దీపాలలంకరణ చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్‌దీపాలంకరణ చేస్తున్న పన్నీరు సెల్వం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలకృష్ణ ఒక సర్టిఫైడ్ సైకో

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నా ధ్వజం


మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి చిన్నా

వరదయ్యపాళెం: శాసన సభ్యుడి హోదాలో ఉంటూ మానసిక పరిస్థితి బాగా లేక మెంటల్ సర్టిఫికెట్ ఉన్న సర్టిఫైడ్ సైకో సినీ నటుడు బాలకృష్ణ అని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికార ప్రతినిధి చిన్నా ధ్వజమెత్తారు. గురువారం చిన్నా మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బాలకృష్ణ దుర్భాషలాడడాన్ని చిన్నా తీవ్రంగా ఖండించారు. దేవాలయంగా భావించే అసెంబ్లీలో కళ్ల జోళ్లను నెత్తిన పెట్టుకుని రెండు జేబుల్లో చేతులు పెట్టుకుని వీధి రౌడీలా ఒక మాజీ ముఖ్యమంత్రిని ఏకవచనంతో దుర్భాషలాడడం హేయ మైన చర్య అని, తక్షణమే ఆయన్ని వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పి ఆయన మానసిక ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేయాలని సూచించారు. బాలకృష్ణ నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని హెచ్చరించారు. గతంలో ఓ వ్యక్తిపై కాల్పులు జరిపిన కేసులో బాలకృష్ణ మానసిక స్థితి బాగాలేదని సర్టిఫికెట్ తెచ్చుకున్నారన్నారు. వారి అంతర్గత గొడవల మధ్యకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. తక్షణమే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రారంభ దశలో క్యాన్సర్ గుర్తిస్తే చికిత్సతో నయం

తిరుపతి సిటీ: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ ఎస్ లక్ష్మీ సంధ్య మాట్లాడారు. ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ చికిత్సతో దాని నుంచి విముక్తి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ధూమపానం, మద్యానికి దూరంగా ఉండాలని, వ్యాయామం చేయాలని, సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. విభాగాధిపతి సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీ.రాజ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

దృఢత్వానికి ప్రతీక భారతీ అల్ట్రా సిమెంట్


మేస్త్రీలకు ప్రమాద బీమా పత్రాలను అందజేస్తున్న మేనేజర్ చాయాపతి

కేవీబీపురం: నమ్మకానికి, దృఢత్వానికి భారతీ అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ప్రతీకగా నిలుస్తుందని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ పీ.చాయాపతి తెలిపారు. గురువారం కేవీబీపురం మండల కేంద్రంలోని టీడీఆర్ స్టీల్ అండ్ సిమెంట్ అధినేత తాటిపర్తి దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చాయాపతి మాట్లాడుతూ జర్మనీ టెక్నాలజీ, రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ నిపుణుల పర్యవేక్షణలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో భారతీ అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. టెంపర్ ప్రూఫ్ బస్తాలతో మార్కెట్‌లోకి వస్తుండడంతో తూకంతో కూడా మార్పులు ఉండవన్నారు. సిమెంట్ రంగంలో భారతీ సిమెంట్ అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. అనంతరం భారతీ సిమెంట్‌కు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలు, విశిష్టత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం తాపీమేస్త్రీలకు రూ.లక్ష ప్రమాదబీమా పత్రాలను అందజేశారు.

స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ పేరిట గర్భిణులపై నిర్లక్ష్యం


ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న గర్భిణులు


ఖాళీగా ఉన్న గైనకాలజిస్టు విభాగం గది

- వైద్యాధికారుల కోసం పడిగాపులు

చంద్రగిరి : అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకోవడానికి వైద్యాధికారులు అవలంబించిన తీరుతో గర్భిణులు అవస్థ పడిన ఘటన చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే.. చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆరుణ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని 11 గంటలు దాటిన నిర్వహించలేదు. దీంతో అప్పటికే సమీకరించిన రోగులు వేచి ఉండాల్సి వచ్చింది. ఆస్పత్రి లోపల ఉన్న రోగులకు అందుబాటులో వైదాధికారులు లేకుండా అందరూ కార్యక్రమానికి వెళ్లారు. దీంతో రోగులు ఆస్పత్రిలో వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులను పడాల్సి వచ్చింది. ప్రతి గురువారం గర్భిణులకు ప్రత్యే వైద్య సేవలను అందిస్తారు. ఈ క్రమంలో గురువారం మండల వ్యాప్తంగా గర్భిణులు ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. కనీసం నిండు చూలాలకు వైద్య సేవలను అందించకుండా అధికారులు ఇతర కార్యక్రమాలకు వెళ్లడంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. చంద్రగిరిలో అధికారుల అత్యుత్సాహం ప్రజలకు శాపంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎలాంటి ప్రొటోకాల్ లేని వారి కోసం రోగులను ఇబ్బందులు పెట్టడం సరికాదంటూ రోగుల సహాయకులు మండిపడ్డారు.

చూడతరమా అవస్థ

సభలు..సమావేశాలు..కూటమి దాంబికాలతో సామాన్య ప్రయాణికుడి అవస్థ చూడతరం కాలేదు. కూటమి సర్కారు తరచూ ప్రభుత్వ కార్యక్రమాలకు ఆర్టీసీ బస్సులను వాడుకుంటుండడంతో బస్సుల కొరత ఏర్పడుతోంది. ఫలితంగా గమ్యస్థానాలకు చేరాల్సిన సగటు ప్రయాణికుడికి తిప్పలు తప్పడం లేదు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులతోపాటు రోజువారీ ప్రయాణికులు నరకయాతన అనుభవించాల్సి వస్తోంది.

- బస్సుల కొరతతో ప్రయాణికులకు తిప్పలు
- బస్సు ఆగిన వెంటనే ఫుల్
- నిల్చోవడానికి స్థలం కరువు
- ప్లాట్‌ఫామ్‌కు రాకముందే బస్సు ఫుల్


బస్సుల కోసం తిరుపతి బస్టాండ్‌లో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

తిరుపతి అర్బన్: ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం అన్ని కార్యక్రమాలకు ఇష్టారాజ్యంగా ఆర్టీసీ బస్సులను వాడేస్తోంది. అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు అడిగినన్ని ఆర్టీసీ బస్సులను పంపాల్సి వస్తుంది. దీంతో బస్సుల కొరతతో ప్రయాణికులు నానా తిప్పలు పడుతున్నారు. బుధవారం ఉదయం తిరుపతిలోని చదలవాడ కళాశాల సమీపం నుంచి 80కి పైగా ఆర్టీసీ బస్సులను డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు విజయవాడలో సీఎం నుంచి నియామక పత్రాలు అందుకోవాలంటూ పంపించారు. దీంతో తిరుపతి బస్టాండ్‌తోపాటు జిల్లాలోని 11 డిపోల పరిధిలో బస్సుల కొరత తప్పడం లేదు. గంటల కొద్ది ప్రయాణికులు తమ ప్రాంతానికి చెందిన బస్సు ఎప్పుడు వస్తుందోనని వెయ్యికళ్లతో ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ముందే బస్సుల కొరత..దానికి తోడు తిరుమల బ్రహ్మోత్సవాలు అయినా ఆర్టీసీ బస్సులను విజయవాడకు పంపించేశారు.

బస్సు ఆగిన వెంటనే ఫుల్..

బస్టాండ్‌లో బస్సు ఆగిన ఐదు నిమిషాల్లోనే ఫుల్ అయిపోతుంది. ఆయా ప్రాంతాలకు చెందిన ప్లాట్‌ఫామ్‌లకు బస్సులు రాకముందే... బస్టాండ్ ప్రవేశ ద్వారం వద్దే ప్రయాణికులు ఎక్కేస్తున్నారు. ఫుల్ అయిన తర్వాతే ప్లాట్‌ఫామ్‌కు వస్తుంది. బస్సులో సీటు కథ దేవుడికెరుక..నిలబడడానికి కాస్త స్థలం ఉంటే చాలురా..బాబు అంటూ ప్రయాణికులు బస్సుల కోసం పరుగులు పెడుతున్నారు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి బస్టాండ్ నుంచి సాధారణ సమయంలోనే రోజుకు 1.50 లక్షల నుంచి 1.55 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికితోడు తిరుమల బ్రహ్మోత్సవాలు...మరోవైపు పల్లె వెలుగు బస్సులు ఉచిత బస్సు పథకానికే పరిమితం అయిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో జిల్లాకు చెందిన బస్సులను ఇతర ప్రాంతాలకు పంపడం ద్వారా ప్రయాణికుల అగచాట్లు అన్నీఇన్నీ కాదు....అయినా అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు మండిపడ్డారు. ప్రభుత్వం తీరును తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఆర్టీసీ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్న ప్రయాణికులు


బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

అక్రమ బదిలీల నిలుపుదల హర్షణీయం


నిరవదిక సమ్మె చేసిన ఉద్యోగ సంఘాలు

తిరుపతి తుడా: విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల సిబ్బంది అక్రమ బదిలీల నిలుపుదలపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి జిల్లా పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో పనిచేస్తున్న మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసియేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా చేస్తున్న నిరవదిక సమ్మెకు తెర పడింది. ఎట్టకేలకు ప్రభుత్వం దిగివచ్చి బదిలీల ప్రక్రియను ఆపివేసింది. దీంతో ఆ సంఘం నాయకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. నిరవధిక నిరసన వ్యక్తం చేసిన ఆ సంఘం అధ్యక్షులు సుమన్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, నాగవెంకటేష్, సమంత్, కృపావతి, జిల్లా నాయకులకు ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు.

మహిళా వర్సిటీలో నవరాత్రి వేడుకలు


పిల్లలు, అధ్యాపకులతో కలసి కోలాటాలాడుతున్న వీసీ ఉమ

తిరుపతి రూరల్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గురువారం నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంగీతం, నృత్యం , లలిత కళల విభాగంలో ఆచార్య ఆర్ఎస్ఎస్ శైలేశ్వరి, డాక్టర్ హిమబిందుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులు నవరాత్రికి సంబంధించిన అమ్మవారి భక్తి పాటల నృత్యాలతో అలరించాయి. కార్యక్రమంలో వర్సిటీ ఉపకులపతి ఉమ, రిజిస్ట్రార్ రజని, అధ్యాపకులు, ఇతర బోధనేతర సిబ్బంది కోలాటం ప్రదర్శించారు.